నమస్తే తెలంగాణ
నాగర్‌కర్నూల్
5 | మహబూబ్‌నగర్, మంగళవారం 19 డిసెంబర్ 2023 | NAGARKURNOOL

కోస్గిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

ఎమ్మెల్యే ఇంటిపై దాడి అప్రజాస్వామికం

- పార్టీ ఫిరాయించిన వారు రాజీనామా చేసి కాంగ్రెస్ బీ-ఫాంపై పోటీచేయాలి
- కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి

కోస్గి, సెప్టెంబర్ 14 : ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై రౌడీలతో కలిసి ఎమ్మెల్యే గాంధీ చేయడం అప్రజాస్వామికమని, దీన్ని అందరూ ఖండించాలని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం కోస్గి పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నుంచి పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు రాజీనామా చేసి కాంగ్రెస్ బీ-ఫాంపై గెలవాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ అక్రమ అరెస్టులకు ఎవరూ భయపడరన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15వ తేదీన రాష్ట్రంలో రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి రూ.46వేల కోట్లలో కేవలం రూ.17వేల కోట్లతో 30శాతం మంది రైతులకు రుణమాఫీ చేశారని ఎద్దేవా చేశారు. కొడంగల్‌లో కూడా 30శాతం మాత్రమే రుణమాఫీ జరిగిందన్నారు. రైతులకు ఇప్పటి వరకు రైతు భరోసా అందించలేదన్నారు. కోస్గి పట్టణంలో గతంలో రూ.8కోట్లతో సయ్యద్ పహాడ్ నుంచి ఏబీకే ఫంక్షన్ హాల్ వరకు డబుల్ లేన్ రోడ్డును కొంత పూర్తి చేశాయగా ప్రస్తుత ప్రభుత్వం దాన్ని ఇంకా పూర్తి చేయలేదన్నారు. గతంలో చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి రూ.70కోట్లు మంజూరు చేయిస్తే వాటికి ఇప్పుడు కొబ్బరి కాయలు కొట్టి పూజలు చేస్తున్నారన్నారు. రైతు భరోసాను పక్కదారి పట్టించడానికి హైడ్రా డ్రామాను తీసుకొచ్చారని ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, త్వరలోనే రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేసి ప్రభుత్వ చేతగాని తనాన్ని ఎండగడుతారన్నారు.

ఫార్మాసిటీని కొడంగల్‌కు రానివ్వం..

నియోజకవర్గంలో ఏర్పాటు చేసే ఫార్మా కంపెనీని అడ్డుకొని తీరుతామని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి హెచ్చరించారు. ఏడు గ్రామాల పరిధిలో వేల ఎకరాల్లో ఫార్మాసిటీని నిర్మిస్తున్నారని తెలిపారు. సీఎం రేవంత్‌ను సూటి ప్రశ్న అడుగుతున్నా.. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాలో 13 వేల ఎకరాలను కేటాయించిందని గుర్తు చేశారు. సిద్ధంగా ఉన్న స్థలంలో ఫార్మా ఏర్పాటు చేయకుండా కొడంగల్‌కు ఎందుకిచ్చారో చెప్పాలని నిలదీశారు. ఇప్పటికే స్థానిక రైతులు ఈ కంపెనీ రాకను వ్యతిరేకిస్తున్నారని, ఇప్పటికైనా ఫార్మా కంపెనీ ఏర్పాటును విరమించుకోవాలన్నారు. కోస్గి పట్టణం సమీపంలో పొల్యూషన్ కంపెనీలు ఎందుకు ఏర్పాటు చేస్తున్నారని ప్రశ్నించారు. వీటిపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అందుకు ముందు కోస్గి పట్టణంలో ఉన్న బీసీ కాలనీ, శాసం కాలనీ, బహర్‌పేట్, బ్రాహ్మణ్ విధీలో ఏర్పాటు చేసిన గణనాథులకు పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకలు శాసం రామకృష్ణ, వెంకట్ నర్సింహులు, కోట్ల మైపాల్, విష్ణువర్ధన్‌రెడ్డి, మాధుయాదవ్, సాయిరెడ్డి, బెజ్జు నర్సింహులు , సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

తేనెటీగల దాడిలో 8మందికి గాయాలు

ధన్వాడ, సెప్టెంబర్ 14 : తేనెటీగల దాడిలో ఎనిమిది మంది గాయపడిన ఘటన శనివారం సాయంత్రం మండల కేంద్రంలో చోటుచేసుకున్నది. గ్రామస్తుల కథనం ప్రకారం చాకలి భాస్కర్ అంత్యక్రియలకు వెళ్లిన వారిపై తేనెటీగలు ఆకస్మికంగా దాడి చేయడంతో కొందరికీ గాయాలయ్యాయి. ఈ దాడిలో శ్రీనివాసులు, శ్రీకాంత్, లక్ష్మి, గోపి, సత్యనారాయణ, వెంకటయ్య, మణెమ్మ, పద్మమ్మ గాయపడగా బాధితులను చికిత్స నిమిత్తం నారాయణపేటలోని ఏరియా దవాఖానకు తరలించారు. ప్రస్తుతం ప్రమాదమేమీ లేదని కోలుకుంటున్నారని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా, శవాన్ని పూడ్చి వేస్తుండగా, ఈ ఘటన చోటుచేసుకోవడంతో చాలామంది తేనెటీగల ధాటికి అర్ధాంతరంగా అంత్యక్రియల నుంచి పరారైనట్లు సమాచారం.

మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యేలు

పేదల గూడును చెదరగొడ్తారా..?

- మహబూబ్‌నగర్‌లో కూల్చివేసిన ఇండ్ల బాధితులకు క్షమాపణ చెప్పాలి
- 'పాలమూరు' ఎత్తిపోతలపై వివక్ష ఎందుకు..?
- మాజీ సీఎం కేసీఆర్‌కు పేరొస్తదని ఆపుతుండ్రా..?
- ముఖ్యమంత్రి రేవంత్‌కు కేటీఆర్ సూటిప్రశ్న

నాగర్‌కర్నూల్ (నమస్తే తెలంగాణ)/తిమ్మాజిపేట, సెప్టెంబర్ 14 : 'పేదలు ఎంతో కష్టపడి కట్టుకున్న గూడును చెదరగొడ్తావా..? రేవంత్‌రెడ్డి.. పాలమూరు బిడ్డను అంటూనే.. పేదల ఇండ్లపైకి బుల్డోజర్ పంపి వారి పొట్ట కొట్టావు.. ఇండ్లను కూల్చడానికే నీవు ముఖ్యమంత్రివి అయ్యావా'..? అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం నేరెళ్లపల్లిలో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి నివాసంలో మీడియాతో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్.. పేదలంటే నీకు ఎందకంతా అలుసన్నారు. సొంత జిల్లా అని చెప్పుకుంటూనే మహబూబ్‌నగర్‌లోని ఆదర్శనగర్‌లో 75 మంది దళితులు, పేదల ఇండ్లను కూల్చివేయించారని మండిపడ్డారు. 17 ఏండ్ల కిందట నాటి కాంగ్రెస్ హయాంలో వైఎస్సార్ హయాంలో పేదలకు స్థలాలు ఇచ్చారని తెలిపారు. ఎన్నో ఆశలతో కట్టుకున్న ఇండ్లు కూలి ఎండకు.. వానకు బాధితులు ఎండుతూ.. తడుస్తుంటే మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వారికి చేయూతనిచ్చారని తెలిపారు. కనీసం నోటీసులు ఇవ్వకుండా.. దయ లేకుండా.. ఏ కారణంతో ఇండ్లు కూలగొడ్తున్నారో తెలియజేయకుండా చర్యలు తీసుకోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా చెంపలేసుకొని ఇండ్ల బాధితులకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పేదలపై ప్రేమ ఉంటే కేసీఆర్ ప్రభుత్వంలో పాలమూరులో 4 వేల డబుల్‌బెడ్రూం ఇండ్లు నిర్మించామని, అందులో ఇంకా 300 ఇండ్లు ఖాళీగా ఉన్నాయని, వాటిలో కొన్ని బాధితులకు కేటాయించాలన్నారు. సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, వివేకానందగౌడ్, సంజయ్, అనిల్‌కుమార్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, బాల్క సుమన్, బిగ్గాల గణేశ్‌గుప్తా, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

లక్ష్మారెడ్డికి కేటీఆర్ పరామర్శ

ఆవంచలో మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, అతడి కుమారుడిని ఓదారుస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

తిమ్మాజిపేట, సెప్టెంబర్ 14 : సతీ మణిని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. మండలంలోని ఆవంచలోని ఆయన స్వగృహానికి శనివారం మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతో చేరుకొన్న ఆయన లక్ష్మారెడ్డిని ఓదార్చారు. శ్వేతారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆయన్ను హత్తుకుని ధైర్యంగా ఉండాలని సూచించారు. మృదుస్వభావి లక్ష్మారెడ్డికి భార్య వియోగం బాధాకరమన్నారు. లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులు, కుమారుడు, కుమార్తెతో మాట్లాడారు. కేటీఆర్ వెంట మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు వివేకానంద, పాడి కౌశిక్‌రెడ్డి, సంజయ్, అనిల్‌కుమార్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, బాల్కసుమన్, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, గణేశ్‌గుప్తా వచ్చి పరామర్శించారు. అంతకు ముందు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, దామోదర్‌రెడ్డితో పాటు జడ్చర్ల, నాగర్‌కర్నూల్ నియోజకవర్గాలకు చెందిన బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు మాజీ మంత్రి లక్ష్మారెడ్డిని కలిసి సంతాపం తెలియజేశారు.

శ్వేతారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కేటీఆర్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, నేతలు

త్వరలో 'పాలమూరు' సందర్శన : కేటీఆర్

సీఎం రేవంత్.. మీకు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు అంటే పట్టదా..? అంటూ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో దాదాపు 90 నుంచి 95 శాతం పనులు పూర్తి చేస్తే.. కాంగ్రెస్ వచ్చిన పది నెలల్లో పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. పనులను పూర్తి చేసి సాగునీళ్లు పారిస్తే ప్రతి నీటి చుక్కలో కేసీఆర్‌ను రైతులు తలుచుకుంటారని, ఆయనకే మంచి పేరొస్తదనే వివక్ష చూపుతున్నారన్నారు. ఈ ఎత్తిపోతలపై చిత్తశుద్ధిని తెలియజేస్తామని చెప్పారు. 95 శాతం పనుల పూర్తయినట్లు ప్రజలకు వివరించేందుకు మేడిగడ్డ తరహాలో రెండ్రోజుల పాటు సందర్శిస్తామని స్పష్టంచేశారు. ఉమ్మడి జిల్లాలోని బీఆర్ఎస్ నాయకత్వమంతా కేసీఆర్ కట్టించిన రిజర్వాయర్లు, పంపుహౌజ్‌లను ప్రజలకు చూపిస్తామన్నారు. ఈ యాత్ర ద్వారా ముఖ్యమంత్రి కొడంగల్ ప్రాజెక్టుకు పైసలు ఖర్చు చేస్తూ.. పాలమూరు ఎత్తిపోతల పనులను ఎలా ఎండబెడుతున్నాడో ప్రజలకు వివరంగా తెలియజేస్తామని హెచ్చరించారు. భూములు ఇచ్చి ఈ ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించిన రైతులు, ప్రజలకు చేతులెత్తి నమస్కరిస్తున్నట్లు చెప్పారు.

విద్యార్థిని చితకబాదిన ప్రిన్సిపాల్

- తీవ్రంగా గాయపడిన విద్యార్థి

తీవ్రంగా గాయపడిన విద్యార్థి సురేందర్

బిజినేపల్లి, సెప్టెంబర్ 14: పాఠశాలకు ఆలస్యంగా వచ్చాడన్న నెపంతో ఓ విద్యార్థిని ప్రిన్సిపాల్ కర్రతో చితకబాదిన ఘటన మండలకేంద్రంలో చోటు చేసుకున్నది. విద్యార్థి తల్లిదండ్రులు కథనం ప్రకారం మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన సురేందర్ బిజినేపల్లిలోని మేధాంస్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం పాఠశాలకు పది నిమిషాలు ఆలస్యంగా వచ్చాడన్న కారణంగా సురేందర్‌ను ప్రిన్సిపాల్ రమేశ్ కర్రతో తీవ్రంగా కొట్టడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గాయాలు తాళలేక విద్యార్థి ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడని, విషయం తెలుసుకున్న స్నేహితులు బైక్‌పై గౌరారం గ్రామానికి తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. తీవ్ర గాయాలతో వణుకుతున్న విద్యార్థి ఒంటిపై గాయాలు చూసి తల్లిదండ్రులు ఆగ్రహానికి గురయ్యారు. అకారణంగా తమ కుమారుడిని తీవ్రంగా కొట్టిన ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈమేరకు ఎంఈవోలు, పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తల్లిదండ్రులు తెలిపారు.

జూరాలకు తగ్గిన వరద

గద్వాల/అయిజ/, సెప్టెంబర్ 14 : జూరాల ప్రాజెక్టుకు వరద తగ్గుముఖం పట్టింది. ప్రాజెక్టుకు ఎగువ నుంచి 52,800 కూసెక్కుల వరద వచ్చి చేరుతున్నది. దీంతో జూరాల ప్రాజెక్టు 4గేట్లు ఎత్తి దిగువకు 58,435 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. పూర్తిస్థాయి నీటి నిల్వ 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటినిల్వ 9.070లుగా ఉన్నది. జూరాల ఎడమ కాల్వకు 730, కుడి కాల్వకు 630, నెట్టెంపాడ్ లిఫ్ట్‌కు 750, భీమా లిఫ్ట్-2కు 750, సమాంతర కాల్వకు 850 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఐదు యూనిట్లలో విద్యుదుత్పత్తి కొనసాగుతుండగా విద్యుదుత్పత్తికి 38,849 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ఆల్మట్టి ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 32,690, అవుట్ ఫ్లో 28,628 క్యూసెక్కులుగా ఉన్నది. నీటి మట్టం 129.72 టీఎంసీలకు గానూ, ప్రస్తుతం 128.01 టీఎంసీల నిల్వ ఉన్నది. నారాయణపుర ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 29,189, అవుట్ ఫ్లో 26,318 క్యూసెక్కులు ఉన్నది. తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో 21,950, అవుట్‌ఫ్లో 21,356 క్యూసెక్కులుగా ఉన్నది. 105.788 టీఎంసీల గరిష్ఠ సామర్థ్యం కలిగిన టీబీ డ్యాంలో ప్రస్తుతం 101.656 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. ఆర్డీఎస్ ఆనకట్టకు 20,631, ఆయకట్టుకు 631 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఆనకట్టలో 9.7 అడుగుల మేరకు నీటి మట్టం ఉన్నది.

పారిశుధ్య కార్మికులు లేక జెండా పండగ రోజున జడ్చర్ల కిష్టారం పీఎస్‌లో కల్లాపి జల్లుతున్న విద్యార్థినులు (ఫైల్)

స్వచ్ఛతకు దిక్కేది !

- సమస్యలకు నెలవు సరస్వతీ నిలయాలు
- సీఎం సారు.. 68 రోజులైనా హామీ అమలుకు నోచుకోలే.!
- అమ్మ ఆదర్శ కమిటీ ఆచరణలోకి వచ్చేదెన్నడూ.!
- పాలమూరులో వంతుల వారీగా విద్యార్థులు, ఉపాధ్యాయులే స్వచ్ఛ సేవకులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబర్ 14: వ్యాధుల కాలం.. పరిసరాల పరిశుభ్రతే ప్రధానం అంటున్న ప్రభుత్వం.. సర్కారు బడులను మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో పారిశుధ్యం పడకేసింది. మరుగుదొడ్లు, మూత్రశాలలను శుభ్రం చేసే సిబ్బంది లేకపోవడంతో పాఠశాల ప్రాంగణాల్లో అపరిశుభ్రత నెలకొన్నది. చెత్తా చెదారాన్ని ఊడ్చే దిక్కు లేక.. విద్యార్థులు, ఉపాధ్యాయులు, టీచర్లు పారిశుధ్య కార్మికులుగా అవతారమెత్తే దుస్థితి పాలమూరులో నెలకొన్నది.జూలై 9న పాలమూరు జిల్లా పర్యటనకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఫైలట్ ప్రాజెక్టుగా పాలమూరులో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ఎంపిక చేసిన సిబ్బందితోనే పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు ప్రకటించి 68రోజులకు పైనే గడుస్తున్నా.. నేటికీ ఎటువంటి పురోగతి కన్పించడం లేదు. దీంతో సరస్వతీ నిలయాలు అపరిశుభ్రతకు చిరునామాగా దర్శనమిస్తున్నాయి. మున్సిపల్, పంచాయతీ కార్మికులు పారిశుధ్య చర్యలు చేపడుతున్నారని గతంలో అధికారులు ప్రకటించినా.. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అనేక ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, మూత్రశాలల వద్ద పారిశుధ్య చర్యలు కొరవడటంతో పిచ్చిమొక్కలతో నిండిపోతున్నాయి. ఈనెల 15వ తేదీ సీఎం మరోసారి పాలమూరుకు రానున్న నేపథ్యంలో అయినా ఆయన ఇచ్చిన హామీ అమలుకు చర్యలు చేపడతారా.? లేదా.? అనేది ఆసక్తికరంగా మారింది.

కంపు కొడుతున్న మరుగుదొడ్లు

ప్రతి స్కూల్‌లో వందల సంఖ్యలో విద్యార్థులు, పదుల సంఖ్యలో ఉపాధ్యాయులు ఉండటంతో మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో అంతా అపరిశుభ్ర పరిస్థితులు నెలకొంటున్నాయి. కొన్ని చోట్ల పాఠశాల తరగతి గదులు, వరండాల్లో పారిశుధ్య చర్యలు ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి శుభ్రం చేసుకుంటున్నప్పటికీ మరుగుదొడ్ల విషయంలో వెనుకంజ వేస్తుండటంతో అవి అపరిశుభ్రతకు నిలయాలుగా మారుతున్నాయి. వాటి పరిసరాల్లో పిచ్చిమొక్కలతో నిండి విషపురుగులకు నిలయంగా మారుతున్నాయని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయులు తలా కొంత డబ్బులతో..

ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య చర్యలను చేపట్టేందుకు అక్కడక్కడా ఆయా పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు తలా కొంత డబ్బులు వేసుకొని ప్రైవేట్ వ్యక్తులతో పారిశుధ్య చర్యలను చేపడుతున్నారు. దీంతో కొన్ని పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణ ఫర్వాలేదని చెప్పవచ్చు.

జిల్లా	పాఠశాలలు	కార్మికులు స్వీపర్లు	విద్యార్థులు
మహబూబ్‌నగర్	859	1,693	79,832
నాగర్‌కర్నూల్	848	2,315	82,945
వనపర్తి	537	1,223	53,609
నారాయణపేట	512	1,346	70,601
జోగుళాంబ గద్వాల	475	904	71,820

సిబ్బంది తక్కువ.. ఇబ్బందులు ఎక్కువ

ఉమ్మడి జిల్లాలో పంచాయతీల్లో అరకొర వేతనాలతో కాలం వెళ్లదీస్తున్న పంచాయతీ కార్మికులు తమకు ఇప్పటికే పనిభారం ఎక్కువగా ఉండటంతో పాటు బండెడు చాకిరి చేస్తున్నామని వాపోతున్నారు. సిబ్బంది తక్కువ.. ఇబ్బందులు ఎక్కువ ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలల పరిశుభ్రత బాధ్యతలను అదనంగా తమ నెత్తిపై మోపడం ఇబ్బందిగా ఉందంటున్నారు. ప్రభుత్వం తమకు ఇచ్చే వేతనం కంటే మూడింతలు అదనంగా పనులు చేయించుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మహబూబ్‌నగర్ పట్టణంలోని పోలీస్ లైన్ ప్రభుత్వ పాఠశాల వంట గది సమీపంలోనే మూత్రశాల